క్లుప్తంగా...

అక్బరుద్దీన్‌కు నేతల రంజాన్ శుభాకాంక్షలు



గోల్కొండ: క్రమశిక్షణతో పని చేసే కార్యకర్తలకు మజ్లిస్‌లో సరైన ప్రాధాన్యం ఉంటుందని మజ్లిస్ శాసనసభ పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. సోమవారం పలువురు మజ్లిస్ నాయకులు ఆయనను కలిసి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.మీర్జా ఎక్బాల్ అహ్మద్ జుబేర్‌బిన్ తదితరులున్నారు.

నేడు ఇఫ్తార్ విందు

గోల్కొండ: గోల్కొండ సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఇఫ్తార్ విందు నిర్వహిస్తున్నామని కమిటీ చైర్మన్ ఎస్.రాజు వస్తాద్ అన్నారు. మంగళవారం సాయంత్రం 5 గంటలకు గోల్కొండ పోలీస్ స్టేషన్ ఆవరణలో జరిగే ఇఫ్తార్ విందు కార్యక్రమంలో కమిటీ సభ్యులు, శ్రేయోభిలాషులు పాల్గొనాలని ఆయన సూచించారు.

పండగలు సంతోషాలను పంచాలి



బీజేపి నాయకులు ఆ పార్టీ కార్వాన్ ఇంచార్జ్ టి. అమర్ సింగ్

గోల్కొండ: పండుగలు ఆనందంగా జరుపుకోవాలని బీజేపి కార్వాన్ నియోజకవర్గ ఇంచార్జ్ టి. అమర్ సింగ్ అన్నారు. నానల్‌నగర్ డివిజన్‌లో జరిగిన రంజాన్ ఈద్ మిలన్‌లో ఆయన పాల్గొన్నారు.బీజేపి పాలనలో దేశం అగ్రదేశంగా తయారైందని, మోదీ పాలనను ప్రపంచ దేశాలన్ని మెచ్చుకుంటున్నాయన్నారు.

విజయమేరి ఆసుపత్రిలో ఉచిత యురాలజీ క్యాంప్

అబిడ్స్ : ఈ నెల 26వ తేదీన సైఫాబాద్ విజయమేరీ ఆసుపత్రిలో ఉచిత యురాలజీ హెల్త్ క్యాంపును నిర్వహిస్తున్నామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుశీల తెలిపారు. విజయమేరి ఆసుపత్రి, ఈదు సొసైటీల ఆధ్వర్యంలో ఈ ఉచిత యురాలజీ క్యాంపు చేపడుతున్నట్లు ఆమె వివరించారు. బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ క్యాంపు కొనసాగుతుందన్నారు. కిడ్నీ సమస్యలు, మూత్ర సమస్యలు, కిడ్నీ, బ్లాడర్ స్టోన్స్, కిడ్నీ క్యాన్సర్, బ్లడ్ ఇన్ యూరిన్, బ్లాడర్ ప్రొస్టేట్, డిఫికల్ట్ యూరినేషన్ తదితర ఎలాంటి సమస్యలు ఉన్నా ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి



మజ్లిస్ నాయకులతో కార్పొరేటర్ నసీరుద్దీన్

గోల్కొండ: మజ్లిస్ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్ అన్నారు. సోమవారం పలువురు మజ్లిస్ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నానల్‌నగర్ డివిజన్ కు చెందిన మజ్లిస్ ఏరియా కమిటీలు పటిష్టంగా ఉండి పని చేస్తున్నాయన్నారు.

విద్యుత్ వినియోగదారులు సహకరించాలి

చార్మినార్: టీఎస్ఎస్‌పీడీసీఎల్ సౌత్ సర్కిల్ చార్మినార్ డివిజన్‌లోని ఆర్టిజన్స్ సమ్మె చేస్తున్న సందర్భంగా విద్యుత్ సరఫరాలో ఎక్కడ ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఇప్పటికే అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నామని చార్మినార్ డీఈ లింగయ్య తెలిపారు. ఆర్టిజన్స్ సమ్మె కారణంగా ఎక్కడైన విద్యుత్ సరఫరాలో చిన్న చిన్న అంతరాయం కలిగితే ఆయా విద్యుత్ వినియోగదారులతో తమతో పూర్తిగా సహకరించాలని ఆయన కోరారు. అంతేకాకుండా ఎక్కడైన విద్యుత్ సరఫరాలో ఉద్దేశ్యపూర్వకంగా అంతరాయం కలిగించే కార్యక్రమాలకు దిగడమే కాకుండా ట్రాన్స్‌ఫార్మర్, లైన్లలో అవంతరాలను కలిగించడం, లోకల్ సెక్షన్ ఆఫీస్‌లలో అంతరాయం కలుగజేస్తే వెంటనే హైదరాబాద్ సౌత్ కంట్రోల్ రూమ్ నంబర్ 9491628269కు ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు.

బీజేవైఎం జిల్లా ఆఫీస్ సంయుక్త కార్యదర్శిగా సచిన్

గౌలిపురా: బీజేవైఎం జిల్లా ఆఫీస్ సంయుక్త కార్యదర్శిగా సచిన్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన నియమాక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సచిన్ మాట్లాడుతూ... తనపై నమ్మకంతో ఈ పదవీ బాధ్యతలు అప్పగించడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు.

పాతబస్తీ జలమండలి అధికారుల తీరు మారదా..?

- ప్రజా ఫిర్యాదుల పట్ల స్పందించని అధికారులు..
- నిజాం కాలం నాటి పైప్‌లైన్లతో సమస్యలు...



గంగానగర్-యత్రబ్‌నగర్ బస్తీల్లో కొళాయిల ద్వారా సరఫరా అవుతున్న కలుషిత నీరు(ఫైల్)

చార్మినార్: జలమండలి అధికారుల అలసత్వం..సిబ్బంది నిర్లక్ష్యంతో పాతబస్తీ ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. సమస్యలను పరిష్కరించడానికి సంబంధిత అధికారులు ముందుకు రాకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న కలుషిత నీటి సమస్యలను సంబంధిత జలమండలి అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా...నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంచినీరు కలుషితంగా వస్తున్నాయని స్థానికుల నుంచి అందే ఫిర్యాదుల పట్ల జలమండలి సిబ్బంది పట్టించుకోవడం లేదు. దీంతో నెలల తరబడి కలుషిత నీటి కష్టాలు తీరడం లేదు. రంగు మారి దుర్వాసనతో వస్తున్న నీటిని వేడి చేసి వడ పోసి శుభ్రం చేసుకుంటున్నామని..ఇది రెండు రోజులకొకసారి తప్పని సరిగా చేయాల్సి వస్తుందని అంటున్నారు. కొన్ని ప్రాంతాలలో డ్రైనేజీ పైప్‌లైన్లు...మంచినీటి పైప్‌లైన్లు కలిసి ఉన్నాయి.

నిజాం కాలం నాటి పైప్ లైన్లతో సమస్యలు...

నిజాం కాలం నుంచి ఇవి ఇంకా కొన్ని బస్తీల్లో సమాంతరంగా ఉన్నాయి. అప్పుడప్పుడు డ్రైనేజీ పొంగి మురికినీరు, కుళాయి నీటి పైప్‌ల ద్వారా కలిసిపోయి కుళాయిల ద్వారా కలుషితమైన నీటి సరఫరా కొనసాగుతోంది. దీంతో కలుషిత నీటి సరఫరా సమస్య తలెత్తుతోంది. కలుషిత నీటి సరఫరాతో తాము అనారోగ్యాల బారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం సంబంధిత జలమండలి అధికారులకు తెలిసినా...తాత్కాలిక మరమ్మత్తులు చేసి చేతులు దులుపుకుంటున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీ,మంచినీటి పైప్‌లు కలిసి ఒకే చోట నుంచి వెళుతున్న విషయాలు సంబంధిత అధికారులు, సిబ్బందికి తెలిసినప్పటికీ... శాశ్వతంగా పరిష్కరించడం లేదని అంటున్నారు. యాకుత్‌పురా నియోజకవర్గంలోని గంగానగర్,యత్రబ్‌నగర్ బస్తీలలో గత కొంత కాలంగా మురికినీరు సరఫరా అవుతోంది. సాధ్యమైనంత వెంటనే తమ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

డ్రైనేజీ పొంగిపొర్లుతూ మురికినీరు రోడ్లపై పారుతున్నా...

పాతబస్తీలో డ్రైనేజీ పొంగిపొర్లుతూ మురికినీరు రోడ్లపై పారుతున్నా.. జలమండలి అధికారులు,సిబ్బంది పట్టించుకోవడం లేదని పాతబస్తీ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీలు పొంగి మురికినీరు రోడ్లపై పారుతూ దుర్వాసన కలిగిస్తోందని జలమండలి అధికారులకు ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటున్నారు. వరుసగా కార్యాలయాలకు తిరిగితే, వారం పది రోజులకు స్పందిస్తున్నారని అంటున్నారు. మీకన్నా ముందు ఎంతో మంది ఫిర్యాదు చేసారని...వారందరి సమస్యలను పరిష్కరించిన అనంతరం మీ వద్దకు వస్తామంటూ సిబ్బంది నిర్లక్ష్యంగా బదులిస్తున్నారని అంటున్నారు. ఏం చేయాలి సిబ్బంది కొరత ఎక్కువగా ఉంది...అంతేకాకుండా ఎయిర్ టెక్ మిషన్ ఒక్కటి మాత్రమే ఉంది...రోజుకు ఎన్ని బస్తీలకు వెళ్లగలము..చెప్పండి అంటూ బదులిస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ పొంగుతున్న డ్రైనేజీలను శుభ్రం చేయడానికి వస్తున్న సిబ్బంది అక్కడే రోడ్లపై మురికితో కూడిన వ్యర్థ పదార్థాలను వేసి వెళ్లిపోతున్నారు. బస్తీల్లోని రోడ్లపై ఈ తొలగించిన డ్రైనేజీ మట్టిని రోజుల తరబడి అక్కడే ఉంచడం.. సకాలంలో అక్కడి నుంచి తొలగించక పోవడంతో దుర్వాసన వెలువడుతుందని స్థానికులు అంటున్నారు. చౌక్ మైదాన్ ఖాన్‌లోని హనుమాన్ దేవాలయం ప్రధాన ద్వారం వద్దనే వారానికి ఒకసారి ఖచ్చితంగా డ్రైనేజీ పొంగుతోంది.భక్తులకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. శాశ్వతంగా పరిష్కారం చేయడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మురికినీటితో అనారోగ్య సమస్యలు...

పొంగి పొర్లే మురికినీటితో స్థానికులు తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారు. ముఖ్యంగా పాదచారులు, స్కూల్ సమయాల్లో విద్యార్థులు రోడ్లపై పేరుకుపోతున్న మురికినీటితో పడరాని పాట్లు పడుతున్నారు.

సంబంధిత జలమండలి ఉన్నతాధికారులు పాతబస్తీలో డ్రైనేజీ మురికినీటిని అరికట్టడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని...ఫిర్యాదులు అందినప్పుడు మాత్రమే కంటితుడుపు చర్యల్లాగా తూతూ మంత్రం పనులు చేసి చేతులు దులుపుకుంటున్నారని.. ఫిర్యాదులు అందినా, అందకపోయినా క్రమం తప్పకుండా పర్యవేక్షణ చేస్తే ఆశించిన ఫలితాలుంటాయని బాధితులు అంటున్నారు.

జాతీయ సమైక్యత శిబిరంలో సిటీ కళాశాల సిబ్బంది



శిబిరంలో పాల్గొన్న సిటీ కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారులు, వలంటీర్లు

చార్మినార్: కేంద్ర క్రీడలు, యువజన వ్యవహారాల శాఖ ఆధ్వర్యంలో ఢిల్లీ ప్రాంతీయ సంచాలకులు హర్యానా అగ్రికల్చర్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన 7 రోజుల జాతీయ సమైక్యత శిబిరానికి సిటీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం అధికారులు డాక్టర్ డి.నాగరాజు, వాలంటీర్ ఎన్.పవన్, తెలంగాణ రాష్ట్రం ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎన్నికయ్యారు. తెలంగాణ రాష్ట్రం నుంచి వీరితో పాటు వలంటీర్లు లిఖిత, ఆర్తీ, కవిత, తేజస్విని, వైష్ణవి, జగదీశ్వర్, నరేందర్, భాను, జయంత్‌లు ఎన్నికై పాల్గొన్నారు. కార్యక్రమంలో మన తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయం, నృత్యం, పండుగలపైన నృత్య, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

26 నుంచి అక్కన్న మాదన్న ఆలయ బోనాల వజ్రోత్సవాలు



సమావేశంలో ఆలయ కమిటీ అధ్యక్షులు డాక్టర్ ఆవుల భరత్ ప్రకాష్

యాకుత్‌పురా: పాతబస్తీ హరిబౌళి శ్రీ అక్కన్న మాదన్న మహాంకాళీ దేవాలయం 75వ వార్షిక బోనాల వజ్రోత్సవాలను ఈ నెల 26 నుంచి జూలై 19 వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నామని అలయ కమిటీ అధ్యక్షులు డాక్టర్ ఆవుల భరత్ ప్రకాష్ తెలిపారు. హరిబౌళిలోని ఆలయ ప్రార్థన మందిరంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ... రానున్న 75 వ బోనాల వజ్రోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటుంన్నామన్నారు.

బైక్ కోసం గొడవ.. ఒకరి హత్య



మృతిచెందిన మహ్మద్ సోహెల్ (ఫైల్)

జియాగూడ: బైకు కోసం తలెత్తిన గొడవలో పథకం ప్రకారం ఇద్దరు యువకులను తోటి స్నేహితులే బంధించి, హింసించి కర్రలు, మద్యం సీసాలతో తీవ్రంగా దాడిచేశారు. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి.ఈ సంఘటన కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ తెలిపిన మేరకు.. ఆసిఫ్‌నగర్‌కు చెందిన మహ్మద్ సోహెల్ (21) గ్లాస్ కటింగ్ వర్క్ చేస్తుంటాడు. ఇతని స్నేహితులు టప్పాచబుత్రకు చెందిన దీపక్, జియాగూడ సంజయ్‌నగర్‌కు చెందిన యోగేష్, అత్తాపూర్‌కు చెందిన శంకర్, మహేహేష్, వరుణ్, అరుణ్‌లు ఉన్నారు. రెండు నెలల క్రితం సోహేల్, దీపక్‌ల స్నేహితుడైన అరుణ్ వద్ద నుండి యోగేష్ బైకును కొనుగోలు చేశాడు. రూ.20 వేలు ఇవాల్సి ఉండగా కేవలం రూ.5 వేలు మాత్రమే ఇచ్చాడు. మిగతా రూ.15 వేలు ఇవ్వలేదు. దీంతో గత నెలరోజుల క్రితం యోగేష్ వద్ద నుండి అరుణ్ అతనికి తెలియకుండా బైక్‌ను తీసుకుని వెళ్లిపోయాడు. అప్పటి నుండి యోగేష్, శంకర్‌లు బైక్ కోసం వెతుకుతున్నారు. అనుమానంతో సోహెల్, దీపక్‌లను కూడా బైకు వివరాలు అడిగాడు. వారు తెలియదు అని చెప్పడంతో ఆదివారం ఉదయం నుండి మహ్మద్ సోహేల్, దీపక్, యోగేష్, శంకర్, మహేష్, వరుణ్‌లు కలిసి బైక్‌ను వెతకడం ప్రారంభించారు. ఎంతకీ బైకు లభించకపోవండతో పథకం ప్రకారం జియాగూడ 2బి-హెచ్‌కే కాలని, కె.బ్లాక్ 5వ ఫ్లోరు టెర్రస్ పైనే మహ్మద్ సోహేల్, దీపక్‌లను బంధించి మద్యం సేవించి చిత్రహింసలకు గురిచేశారు. కర్రలు, మద్యం బీర్‌బాటిళ్లతో దాడిచేయగా తీవ్ర రక్తస్రావం అయ్యింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకోగా మహ్మద్ సోహేల్, దీపక్‌లను ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మహ్మద్ సోహేల్ ఉదయం 10 గంటల ప్రాంతంలో మృతి చెందగా దీపక్ స్వల్ప గాయాలతో బయటకు వచ్చాడు.

యుగపురుషుడు ఎన్టీఆర్

గన్‌ఫౌండ్రీ: నేటితరం నటీనటులు ఎన్టీఆర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యా నియంత్రణ పర్యావేక్షణ కమిషన్ చైర్మన్ జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో యువకళావాహిణి ఆధ్వర్యంలో ఎన్టీరామారావు శతజయంతిని పురస్కరించుకుని పలువురికి ఎన్టీఆర్ స్మారక పురస్కారాలను ప్రధానం చేశారు. అంతకు ముందు గాయని గాయకుల చిత్ర గీతాలాపన ఆహుతులను ఆకట్టుకుంది. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, ఏఎస్ఆర్ నాటక కళాపరిషత్ అధ్యక్షులు సారిపల్లి కొండల్‌రావు తదితరులు పాల్గొన్నారు.



పురస్కార గ్రహీతలతో జస్టిస్ రామలింగేశ్వరరావు తదితరులు

25న బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం

గోల్కొండ: ఈనెల 25న కార్వాన్ నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమ్మేళనాన్ని భారీ ఎత్తున నిర్వహిస్తున్నానని ఆపార్టీ కార్వాన్ ని యోజకవర్గ ఇంచార్జ్ టి.జీవన్ సింగ్ తెలిపారు. సోమవారం కార్వాన్‌లో ఆత్మీయ సమ్మేళనం సన్నాహక సమావేశం జరిగింది. డివిజన్ స్థాయిలో జరిగినఆత్మీయ సమ్మేళనాలు విజయవంతమయ్యాయని, అదే స్ఫూర్తితో నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తామని ఆయన అన్నారు. లంగర్‌హౌస్ డీ ఫోర్ట్ లో నిర్వహిస్తున్నామని ఆయన అన్నారు.



కార్యక్రమంలో జీవన్ సింగ్ తదితరులు

సన్మానం



ఈద్గా ఖతీబ్‌ను సన్మానిస్తున్న ఎస్.రాజు వస్తాద్ తదితరులు

గోల్కొండ: హైదరాబాద్ నగర వాసులు సహనశీలతకు మారుపేరుగా నిలుస్తూ వస్తున్నారని గోల్కొండ కుతుబ్‌షా ఈద్గా నిర్వహణ కమిటీ అధ్యక్షులు గులాం మొహియుద్దీన ఖాన్ పాషాభాయ్ అన్నారు. సోమవారం గోల్కొండ సెంట్రల్ పీస్ అండ్ కమిటీ నిర్వాహకులు దక్కన్ పార్కులో ఈద్గా ఖతీబ్ హజ్రత్ మౌలాన్ ఖారీ సయ్యద్ మతీన్ అలీషాను సన్మానించారు. కార్యక్రమంలో దళిత రత్న రాజువస్తాద్ తదితరులు పాల్గొన్నారు.

రమణీయం భరతనాట్యం

గన్‌ఫౌండ్రీ: శృతిలయ కేంద్ర నటరాజాలయ సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ నృత్య గురువు డాక్టర్ రాజశ్వరీ సాయినాథ్ శిష్యురాలు హరిత కన్నదాసన్ భర్తనాట్య ఆరంగేట్రం సోమవారం రవీంద్రభారతిలో కన్నుల పండువగా జరిగింది. పుష్పాంజలి, జతిస్వరం, వర్ణం, థిల్లాన వంటి అంశాలపై చక్కటి హావాభావాలతో సాగినటువంటి నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.



ఫుట్‌పాత్‌ల మీదనే అందమైన షాండ్లియర్స్



అమ్మకానికి సిద్ధంగా ఉన్న షాండ్లియార్

గోల్కొండ: దేశ రాజధాని ఢిల్లీకి చెందిన కొన్ని కుటుంబాలు నగరానికి వలసవచ్చాయి. వీరు మెహిదీపట్నం, షేక్‌పేట్ నాలా తదితర ప్రాంతాలలో ఫుట్‌పాత్‌లపై కాపురం ఉంటున్నారు. వీరి చేతుల్లో అద్భుతమైన నైపుణ్యం ఉంది. వీరు వేళ్ళు తిప్పితే అద్భుతమైన షాండ్లియార్స్, డెకరేషన్ పార్ట్స్ తయారవుతాయి. ప్రతిఏటా ఈ కుటుంబాల వారు ఏప్రిల్, మే నెలలో నగరానికి వస్తారు. అందమైన వివిధ సైజుల షాండ్లియార్స్‌తోపాటు డెకరేటివ్ పార్ట్స్ తయారు చేయడంలో వీరు సిద్ధహస్తులు. మెహిదీపట్నంలో ఢిల్లీకి చెందిన కృష్ణా, జితేన్ సోదరులు తమ భార్యా పిల్లలతో నగరానికి వస్తుంటారు. తాము హైదరాబాద్ షాండ్లియర్ హోల్‌సేల్ ధర కంటే తక్కువతే షాండ్లియార్స్ తయారు చేస్తున్నామని కృష్ణా అంటున్నారు. తమ కుటుంబం మొత్తం షాండ్లియర్ తయారు చేస్తుందని, షాండ్లియర్ తయారీకి కావాల్సిన ముడి పదార్థాలు తాము నేరుగా ఢిల్లీనుంచితెచ్చుకుంటున్నామని ఆయన అంటున్నారు. అందువల్లో షోరూంలో రూ.12 వేలకు లభించే షాండ్లియర్ రూ.3వేలకే ఇవ్వగల్గుతున్నామన్నారు. కాగా ఈ కుటుంబం గత 15 సంవత్సరాలుగా ప్రతిఏటా నగరానికి వస్తున్నది. అయితే తమకు తెలిసిన కస్టమర్లు ప్రతిఏటా తమ వద్దకు వస్తారని, ఎందరో అడ్వాన్స్‌లు ఇచ్చి షాండ్లియర్ తయారు చేసుకుంటారని కృష్ణ అంటున్నారు.



షాండ్లియార్ తయారీలో కుటుంబ సభ్యులు

అరుంధతి కాలనీలో ఘర్షణ



దాడిలో గాయపడిన నందు కుమారుడు

సంతోష్‌నగర్: సంతోష్‌నగర్ పీఎస్ పరిధిలోని అరుంధతి కాలనీ ప్రాంతంలో ఆదివారం రాత్రి ఘర్షణజరిగింది. ఇన్‌స్పెక్టర్ రమేష్ కుమార్ తెలిపిన మేరకు.. మద్యం మత్తులో షేక్ అమీర్ అక్కపై దాడి చేస్తున్నాడు. దీంతో స్థానికంగా ఉండే నందు అడ్డుకున్నాడు. దీంతో షేక్ అమీర్ నందుపై దాడికి పాల్పడ్డాడు. ఆగ్రహించిన నందు కుమారులు హరిబాబు, అంజనేయులుతో పాటు మరో కుమారుడు మద్యం మత్తులో షేక్ అమీర్‌ను చితకబాదారు. దీంతో షేక్ అమీర్ కొంతమంది యువకులతో అర్ధరాత్రి దాటిన అనంతరం నందు ఇంటికి చేరుకొని నందుతో పాటు ఆయన కుమారులపై కర్రలతో దాడులకు పాల్పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న నగర అడిషనల్ సీపీ విక్రమ్ సింగ్ మాన్, దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య, దక్షిణ, తూర్పు మండల డీసీపీ రూపేష్, సంతోష్‌నగర్ ఏసీపీ మహ్మద్ గౌస్, సంతోష్‌నగర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. అనంతరం గాయాలకు గురైన నందుతో పాటు ఆయన కుమారులను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. నందు ఫిర్యాదు మేరకు సంతోష్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దాడులకు పాల్పడిన 19 మందిని అరెస్ట్ చేసి వారిపై సెక్షన్ 307 కింద చేసుకొని నమోదు చేసుకొని దర్యాప్తు కొనసాగిస్తున్నామన్నారు.

ఘనంగా పరశురామ్ శోభాయాత్ర

అబిడ్స్: పశురామ్ శోభాయాత్రను ఉత్తర భారతీయులు ఘనంగా నిర్వహించారు. పరశురామ్ జయంతి వేడుకల్లో భాగంగా శోభాయాత్ర చేపట్టారు. ఫీల్‌ఖానా, బేగంబజార్, మహారాజ్‌గంజ్, ఛత్రి, కోల్సివాడి తదితర ప్రాంతాల్లో వందలాదిమంది ఉత్తర భారతీయులు శోభాయాత్ర నిర్వహించారు. గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌ఛార్జ్ నందకిశోర్‌వ్యాస్ బిలాల్ వేడుకల్లో పాల్గొని భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు.



శోభాయాత్రలో పాల్గొన్న గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌ఛార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ తదితరులు

30లోపు ఎర్లీబర్డ్స్ స్కీంను సద్వినియోగం చేసుకోండి



డిప్యూటీ కమిషనర్ నరసింహకు ఆస్తి పన్ను చెక్కులను అందజేస్తున్న క్రీడా అధికారులు

యాకుత్‌పురా: ఆస్తిపన్ను చెల్లింపులపై ప్రభుత్వం కల్పించిన ఎర్లీబర్డ్స్ స్కీం 5 శాతం రాయితీతో ప్రజలందరూ తమ ఆస్తిపన్నును ఈ నెలా 30లోపు చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ సంతోష్ నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ నరసింహ్మా సూచించారు. ఎర్లీబర్డ్స్ కార్యక్రమం ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా సోమవారం ఆయన సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఏఎంసీ మోహన్‌రెడ్డి, టాక్స్ ఇనిస్పెక్టర్లు, బిల్ కలేక్టర్లులతో కలిసి పర్యటించారు. ప్రతి ఏడాది ముందస్తూ ఆస్తి పన్ను చెల్లించే వారికి ప్రభుత్వ 5 శాతం రాయితీతో నెలా రోజుల పాటు ఎర్లీబర్డ్స్ కార్యక్రమం నిర్వహిస్తుదన్నారు.

గోమాతను సంరక్షించాలి...

గన్‌ఫౌండ్రీ: గోవుల సంరక్షణ గోవా రాష్ట్రం నుంచి ప్రారంభం కావాలని నమోవందే గోమాతరం సంస్థ జాతీయ అధ్యక్షులు పెరిక సురేష్ అన్నారు. ఈ మేరకు సోమవారం గోవా ముఖ్యమంత్రిని కలిసి జ్ఞాపికను అందజేసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... భారతీయ సంస్కృతికి ప్రతిరూపం గోమాత అని, గోమాతను సంరక్షించుకోవాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు.



గోవా సీఎంకు జ్ఞాపికను అందజేస్తున్న సురేష్ తదితరులు

కార్యకర్తల్లో ఉత్సాహం నింపాలి



అసదుద్దీన్‌తో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మజ్లిస్ కార్యకర్తల్లో ఉత్సాహం నింపుతూ వారి మరింత క్రమశిక్షణతో పనిచేసేలా చూడాలని ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు, హైదరాబాద్ ఎంపీ అసుద్దీన్ ఒవైసి అన్నారు. సోమవారం కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ ఆయనను కలిశారు. రంజాన్ మాసంలో ప్రతి ఒక్కరు దైవభక్తితో ఉపవాస దీక్షలు ఆచరించారని, అదే స్ఫూర్తితో ముమ్ముందు కూడా కార్యకర్తలందరూ ముందుకు సాగాలని ఆయన అన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



ముజీబ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న రాజ్‌కుమార్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: హైదరాబాద్ జిల్లా ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ముజీబ్ హుస్సేన్ తెలిపారు. సోమవారం టీఎన్జీఓస్ పాఠశాల విద్యాశాఖ విభాగం నగర అధ్యక్షుడు కేఆర్.రాజ్‌కుమార్ అధ్యక్షతన ఆయనను కలిసి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించినటువంటి సమావేశంలో ఈ నెల 27వ తేదీన నిర్వహిస్తున్నటువంటి టీఎన్జీఓస్ కేంద్ర సంఘం ఎన్నికలను రాజ్యాంగ విధంగా సమర్థవంతంగా నిర్వహించాలని తీర్మానపత్రం సమర్పించారు.